క్లుప్తంగా

ఘనంగా విద్యార్థుల స్వయం పాలన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంగునూరు(సిద్దిపేట): స్వయంపాలన దినోత్సవాన్ని నర్మేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా దీపిక, డీఈఓగా లాస్య, ఎంఈఓగా వర్షిత్, కాంప్లెక్స్ హెచ్‌ఎంగా యశ్వంత్, ఉపాధ్యాయులుగా మరికొందరు పాఠాలు బోధించారు. వీరిని హెచ్‌ఎం మనీష్ కుమార్, ఉపాధ్యాయులు సీతారాములు, శ్రీకాంత్, సద్మ, శారద అభినందించారు.

మహ్మదాపూర్‌లో భూసార పరీక్షలు

హుస్నాబాద్ రూరల్: తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో రైతుల భూముల్లో భూసార పరీక్షలు చేశారు. రైతులు మట్టి పరీక్షలు చేసుకొని పంటల సాగు చేయాలని చెప్పారు. భూసార పరీక్షలు చేయడం వల్ల నేల స్వభావం తెలుస్తుందన్నారు. నేల స్వభావంతోనే రసాయన ఎరువులు వాడితే పంటల దిగుబడులు వస్తాయని తెలిపారు. ఇందుకు రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రైతులు నేరుగా విద్యార్థులను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు ఒకరికి జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాతో పాటు పలుచోట్ల తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన జడ్జి శ్రావణి 12 మందికి రూ.5 వేల జరిమానా, వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్: గజ్వేల్, సిద్దిపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్న నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్‌నర్స్) పోస్టును కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్‌ఎం లేదా బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగి 5 సంవత్సరాల అనుభవం ఉండి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 15 రోజుల్లోపు గజ్వేల్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

నేటి నుంచి ధరణి స్పెషల్ డ్రైవ్

అక్కన్నపేట(హుస్నాబాద్): ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం శనివారం నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 349 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. సమస్యను పరిష్కరించేందుకు మూడు టీమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. దరఖాస్తులను పరిశీలించి, అవసరమైతే ఫీల్డుకు వెళ్లి వివరాలు సేకరిస్తామన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుడికి మెసేజ్ పంపిస్తామని తెలిపారు.

డీప్యూటీ తహసీల్దార్‌కు ఘన సన్మానం

కోహెడ(హుస్నాబాద్): జిల్లా పౌర సరఫరాల శాఖకు బదిలీ అయిన కోహెడ డీప్యూటీ తహసీల్దార్ కరెడ్ల రాజిరెడ్డిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఘన సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేఖ శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు.

డప్పు కళాకారుడికి సన్మానం

గజ్వేల్‌రూరల్: డప్పు కళాకారుడు అందె భాస్కర్‌ను ప్రజ్ఞాపూర్ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. శుక్రవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ కళారంగాల్లో సేవలందిస్తున్న వారికి కేంద్ర ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులను అందజేస్తుంటుందన్నారు. ఇందులో భాగంగానే మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన దళిత కళాకారుడు భాస్కర్‌కు ప్రముఖ సంగీత వేత్త ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ పేరిట 2022–23 సంవత్సరానికిగాను యువ పురస్కారం అవార్డును ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయానికి గండి

- ఒక్క అనుమతితో రెట్టింపు నిర్మాణాలు
- బహుళ అంతస్తులున్నా ఒక్కదానికే పన్ను వసూలు
- నీటి పన్ను వసూళ్లలో గందరగోళం
- ఎన్నికల దృష్ట్యా వసూలుకు పాలకవర్గం తర్జనభర్జన

ఇంటి నిర్మాణానికి ఒక్క ఫ్లోర్‌కు అనుమతి తీసుకొని అనధికారికంగా రెండు, మూడు ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. అయితే ఇంటి పన్ను వసూలు చేసేది ఒక్క ఫ్లోర్‌కే. దీంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మున్సిపల్‌గా అప్ గ్రేడ్ అయిన తర్వాత వందలాది ఇళ్లు నిర్మించారు. అనుమతి ఇచ్చిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి. అలా చేయకపోవడంతో ఇళ్ల యజమానులు ఇష్టారీతిగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక టీం ఏర్పాటుచేసి అనుమతి లేని ఇళ్లను గుర్తిస్తామని అధికారులు చెబుతున్నారు.



హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 7,130 ఇళ్లు ఉన్నాయి. గ్రామ పంచాయతీ నుంచి మొదలుకొని మున్సిపల్ వరకు చాలా మంది ఒక్క ఫ్లోర్ నిర్మాణానికి పర్మిషన్ తీసుకొని రెండు, మూడు ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. కొత్తగా ఇంటి నిర్మాణం చేపడితే అనుమతి కోసం దాదాపు రూ.60 వేలకు పైగానే ఖర్చు అవుతుంది. ఎన్ని అంతస్తులు కట్టినా ఒక్కదానికే మున్సిపల్ అధికారులు పన్ను వసూలు చేస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఎన్ని అంతస్తులు నిర్మించినా ఒక్క అంతస్తుకే పన్ను వసూలు చేయడమేమిటని ఇటీవల జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఓ సభ్యుడు ప్రశ్నించాడు. హుస్నాబాద్ మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత హుస్నాబాద్ పట్టణంలో కొత్తగా వందలాది ఇళ్లు నిర్మించారు. ఇందులో చాలా మంది ఒక్క ఇంటికే అనుమతి తీసుకొని పైన అనధికారికంగా మరో రెండు, మూడు ఫ్లోర్లు నిర్మించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒక్క ఫ్లోర్‌కు అనుమతి ఇచ్చినప్పుడు, మరో ఫ్లోర్ నిర్మిస్తున్నారా లేదా అని చూడాల్సిన బాధ్యత అధికారులది. అలాగే 2020 ఆగస్టులోగా ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ అయిన వాటికే ఇంటి పర్మిషన్లు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని ప్రభుత్వం కటాఫ్ డేట్ విధించింది. కటాఫ్ డేట్ తర్వాత ఇంటి అనుమతి ఇవ్వకపోవడంతో చాలా మంది ఇంటి అనుమతి లేకుండానే ఇళ్లు నిర్మించారు. కొందరి పాలకవర్గ సభ్యుల ఒత్తిడితో ఇంటి నంబర్లు కేటాయించుకున్నారు. ప్రస్తుతం ఈ సమస్య ఉత్పన్నం కావడంతో అధికారులు అనుమతి లేని ఇళ్ల లెక్క తేల్చే పనిలో ఉన్నారు.

నీటి పన్నుల్లో గందర గోళం

మున్సిపల్ అప్‌గ్రేడ్ అయ్యే నాటికి నీటి పన్నులు పెరుకుపోయాయి. మిషన్ భగీరథ నీటిని వాడుకుంటున్న వినియోగదారులకు నీటి పన్నులు చెల్లించాలనే అవగాహన కల్పించలేదు. దీంతో మిషన్ భగీరథ నీటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందనే ప్రచారం ప్రజల్లోకి వెళ్లడంతో ఆ పన్నులు చెల్లించడం లేదు. నీటి పన్నులు చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేయకపోవడంతో అంతా ఉచితమని అనుకుంటున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో 2023–24 గాను నీటి బిల్లులు దాదాపు రూ.74 లక్షలకుగాను రూ.10 లక్షలే వసూలు చేయడాన్ని అదనపు కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. భగీరథ నీటి సరఫరా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందని, బిల్లులు ఎవరూ చెల్లించడం లేదని అధికారులు సెలవిచ్చారు. మరో వైపు బ్యాంక్ రుణం కోసమో, ఇంటి పన్ను, నల్లా పన్నుల బిల్లులు కావాలని మున్సిపల్‌కు వచ్చిన ఇంటి యాజమానుల నుంచి ఏళ్ల తరబడి బకాయి ఉన్న నీటి బిల్లులను ముక్కుపిండి వసూలు చేస్తుండటంతో సామాన్యులకు భారంగా మారింది. ఏడాది చివరిలో మున్సిపల్ ఎన్నికలు ఉండటంతో నీటి పన్నులు వసూలు చేయాలా? వద్దా? అనే విషయంపై పాలకవర్గం తర్జనభర్జన పడుతోంది.

> **అనుమతి లేని ఇళ్లను గుర్తిస్తాం**
>
> 
>
> ఈ ఏడాది మున్సిపాలిటీకి పన్నుల రూపేణ మార్చిలోగా రూ.1.60 కోట్ల డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు 73 శాతం పన్నులు వసూలు చేశాం. టార్గెట్‌ను పూర్తిచేసే పనిలో ఉన్నాం. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి అనుమతి లేని ఇళ్లను గుర్తిస్తాం. అనుమతి లేకుండా ఎన్ని ఫ్లోర్లు నిర్మించినా వాటికి, ఇంటి పర్మిషన్ ఇచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రెట్టింపు చార్జి వేసి ఇంటి పన్నులు వసూలు చేస్తాం. నీటి పన్నులు తప్పకుండా చెల్లించాల్సిందే. నెలకు రూ.100 చొప్పున వసూలు చేస్తాం. ఎవరికీ మినహాయింపు ఉండదు. ప్రజలు ఇంటి, నీటి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.
>
> – మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

మోదీ చొరవతోనే కొమురవెల్లి రైల్వేస్టేషన్

- బీఆర్‌ఎస్ పార్టీ చెల్లని నోటుతో సమానం
- కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చదు
- మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బూర నర్సయ్యగౌడ్



మల్లన్న సన్నిధిలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రధాని మోదీ చొరవతో కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటవుతోందని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తలతో కలసి ప్రజాసంకల్ప యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఆ పార్టీని ప్రజలు నమ్మడం లేదని, ప్రస్తుతం చెల్లని నోటుతో సమానమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా రైతుబంధు ఇవ్వలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేరని విమర్శించారు. అంతకు ముందు కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీలను గెలిపించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం విజయ సంకల్ప యాత్ర చేర్యాల పట్టణ కేంద్రానికి చేరుకుంది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అమరులకు నివాళి



నంగునూరులో అమరులకు నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు



గజ్వేల్‌లో మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎంఎస్‌పీ నాయకుడు రాములు

నంగునూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణకు పోరాటం చేస్తూ అమరులైన వారికి నివాళులర్పిస్తూ శుక్రవారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు ఎనగందుల యాదగిరి, ఆరెపల్లి కనకయ్య మాట్లాడారు. అమరుల ఆశయ సాధన కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు.

వర్గీకరణ సాధనే అమరులకు నివాళి: ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు రాములు మాదిగ

గజ్వేల్: ఎస్సీల ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సాధనే మాదిగ అమరవీరులకు నిజమైన నివాళి అవుతుందని మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) రాష్ట్ర నాయకుడు మైస రాములు మాదిగ అన్నారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి అస్థిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన మాదిగ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్గీకరణకు ప్రత్యేక చొరవ చూపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, గజ్వేల్ నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

డీఈవో శ్రీనివాస్‌రెడ్డి



డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తొగుట(దుబ్బాక): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. అంతే కాకుండా నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోచేసుకోవాలని కోరారు. పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరుకావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డీఈవోను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, తొగుట, ఎల్లారెడ్డిపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు నర్సయ్య, ఉపేందర్, ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ బిల్లుల పంపిణీ షురూ

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం అమలులో భాగంగా శుక్రవారం దుబ్బాక విద్యుత్ అధికారులు ఉచిత బిల్లుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దుబ్బాక ఏఈ రామాంజనేయులు మాట్లాడుతూ దుబ్బాకలో 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగించిన వినియోగదారులకు మైనస్ బిల్లుతో కూడిన రసీదులను అందించామన్నారు. ఇంకా ఎవరికైన జీరో బిల్లు రాని వారు దుబ్బాక మున్సిపల్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంటు బిల్లుల జిరాక్స్ అందజేయాలన్నారు.

హామీలన్నింటిని నేరవేరుస్తాం

మద్దూరు(హుస్నాబాద్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేరుస్తామని జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్యాకరి కమలాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జాలపల్లి గ్రామంలో గృహజ్యోతి విద్యుత్ బిల్లులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో దూల్మిట్ట ఏఈ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చేర్యాలలో జీరో బిల్లు అందజేస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ద్వారా పేదలకు విద్యుత్ బిల్లుల కష్టాలు తీరనున్నాయని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు భానుప్రకాష్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని తిగుల్ గ్రామంలో విద్యుత్ సిబ్బందితో కలిసి గృహజ్యోతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచే గృహజ్యోతి అమలు అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబ్లూ, కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకుంటున్నారని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం నెంటూరులో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు జీరో బిల్లులు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది సతీష్, మహబూబ్, అశోక్, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): ఆరు గ్యారంటీల్లోని గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలును సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు శుక్రవారం పట్టణ పరిధిలో విద్యుత్ అధికారులు ఇంటింటికి వెళ్లి అర్హులైన వారికి జీరో బిల్లులు అందజేశారు. కార్యక్రమంలో జేఏఓ వినయ్, ఏఈలు తబ్రీచ్, కనకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అక్కన్నపేటలో జీరో విద్యుత్ బిల్లులు ఏఈ హరీశ్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.

నేటితో ముగియనున్న గడువు

- మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి
- గజ్వేల్ టీఎస్‌ఎంఎస్ ప్రిన్సిపాల్ గోపి

గజ్వేల్‌రూరల్: మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో 6, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగియనుందని గజ్వేల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో వంద సీట్లు, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జనరల్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఇతర విద్యార్థులు రూ.125తో మార్చి 2లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌టికెట్లను ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మోడల్ స్కూల్ వెబ్‌సైట్ http:// telanganams. cgg. gov. in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టాసా డైరీ ఆవిష్కరణ



టాసా డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఆత్మ స్టాఫ్ అసోసియేషన్ (టాసా) 2024 డైరీని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ శుక్రవారం జిల్లా కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నూతన సాగు పద్ధతులు, టెక్నాలజీని అందించడంలో ఆత్మ ముందు ఉందన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలో ఆత్మ ఆధ్వర్యంలో నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తూ సాగు పెట్టుబడి తగ్గించి లాభాలు పెంచుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి చరణ్, బీటీఎం శ్రీనివాస్ సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో మొగి నివారణ

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్



రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

కొండపాక(గజ్వేల్): వరి పొలాల్లో లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో మొగి తెగుళ్లను నివారించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రఓవారం మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వరి పంటకు సోకిన మొగి పురుగు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడు పొలాల్లో మొగి పురుగు తెగుళ్లను తట్టుకునే జేసీఎల్ 24423 రకం విత్తనాన్ని వాడుకోవాలన్నారు. నాటు వేసే ముందు నారు కొసలను తుంచి నాటు వేస్తే కొంతవరకు మొగి తెగుళ్ల నివారణ చేసుకోవచ్చన్నారు. అధికంగా రసాయన ఎరువులు వాడితే తెగుళ్ల ఉధృతి పెరిగి వేరు భాగం కుళ్లి ఎర్రబారుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎరువుల కొరత లేదన్నారు. ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, రైతులు నంగి బాలమల్లయ్య, స్వామి, లింగాల లక్ష్మారెడ్డి, బీరయ్య, అక్కారం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మంత్రిని సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని తొగుట, దౌల్తాబాద్, చేగుంట, అక్బర్‌పేట భూంపల్లి, చేగుంట మండలాలకు గజ్వేల్, సికింద్రాబాద్ వరకు బస్సులు నడపాలని కోరారు. కూరగాయల బస్‌లు నడపాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ పొదుపు చేయడం అలవర్చుకోవాలి

తొగుట(దుబ్బాక): విద్యార్థులు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని తొగుట ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ ఫణికుమార్ సూచించారు. ఫైనాన్షియల్ లిటరసీ వారోత్సవాల్లో భాగంగా చిన్నమొత్తాల పొదుపు, సైబర్ నేరాలు, బ్యాంకింగ్ వ్యవస్థపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు బ్యాంకులో ఖాతా తీసుకుని పొదుపు చేయాలన్నారు. ఖర్చుల కోసం తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులను పొదుపు చేసుకుంటే భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉపేందర్, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనులు రద్దు చేయడం తగదు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పలు అభివృద్ధి పనులకు గతంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు మంజూరు చేసిన నిధుల్లో రూ.5.31 కోట్ల పనులను రద్దు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం, అభివృద్ధికి పాటు పడేలా ఉండాలి కానీ, నిదులు రద్దు చేయడం తగదన్నారు.

◆ 16న తైబజార్ వేలం

దుబ్బాక: దుబ్బాకలో నిర్వహించే కూరగాయల మార్కెట్, పశువుల సంత తైబజారుకు వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో కూరగాయల మార్కెట్, పశువుల సంతకు తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు మార్చి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు బ్యాంక్‌లో రూ.25 వేలు విలువల డీడీ తీసి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు. వేలం దక్కించుకున్నవారికి 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31 వరకు తైబజారు కాలపరిమితి ఉంటుందన్నారు.

◆ ఎమ్మార్వోకు ఫిర్యాదు

సిద్దిపేటరూరల్: వెనుకబడిన తరగతులకు చెందిన దాసరి కులస్తులు కొంత కాలంగా ఎస్సీ ఉపకులమైన హోలీయా దాసరి కింద తప్పుడు ధ్రువపత్రాలు పొందారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపూర్ గ్రామ దళిత కులస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని ఆదర్శ గ్రామమైన ఇబ్రహీంపూర్‌లో బీసీ వర్గానికి చెందిన కొందరు తప్పుడు ఆధారాలతో దళిత కులస్తులుగా ధ్రువపత్రాలు పొందారని గ్రామ మాల, మాదిగ కులస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

◆ మొక్కలను సంరక్షిద్దాం

మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

సిద్దిపేటజోన్: హరితహారంలో నాటిన మొక్కలను కాపాడే బాధ్యత అందరిదని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. శుక్రవారం కమిషనర్ పట్టణంలోని మెదక్, హైదరాబాద్, కరీంనగర్ మార్గంలోని డివైడర్‌లోని మొక్కలకు నీళ్లు పోశారు. ప్రభుత్వం ప్రతీ శుక్రవారం హరిత శుక్రవారం పేరిట మొక్కలను కాపాడే చర్యలు చేపట్టిందన్నారు. శుక్రవారం ప్రజలు, అధికారులు సమీపంలో ఉన్న మొక్కలకు నీళ్లు పోయాలని సూచించారు. కార్యక్రమంలో హరితహారం అధికారి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ వంటశాల నిర్మాణానికి నిధులు మంజూరు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారు ఎల్లంపల్లెలోగల టీఎస్ మోడల్ స్కూల్‌లో వంటశాల నిర్మాణానికి రూ.5 లక్షలను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ మంజూరు చేశారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో వంటగది నిర్మాణానికి ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ 31.17 ఎకరాల భూమి స్వాధీనం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారులోగల ప్రభుత్వ భూమిని శుక్రవారం బెజ్జంకి తహసీల్దార్ శ్యామ్ స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా దురాక్రమణదారులు శిక్షార్హులంటూ బోర్డును ఏర్పాటు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జంకి శివారులోని 962 సర్వే నంబర్‌లో 31.17 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు చేసుకున్నారని ఆర్‌టీఐ ప్రచార కార్యదర్శి రాసూరి మల్లికార్జున్ లోకాయుక్త, మానవ హక్కుల సంఘం, ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. అసైన్డ్ చేసుకుని ఐదు ఎకరాల చొప్పున పట్టా పొందిన లబ్ధిదారులు కాకుండా ఈ భూములో మోకాలో ఉన్న వారి నుంచి స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. 31.17 ఎకరాలకు సరైన ఆధారాలు లేని కారణంగా మోకాలో ఉన్నవారికి అసైన్డ్ నిబంధనలు వర్తించవన్నారు. ఈమేరకు తహసిల్దార్ శ్యాం, ఎస్ఐ కృష్ణారెడ్డి, ఆర్ఐ తదతరులు వెళ్లి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా పట్టాదారులు మాట్లాడుతూ తాము కొనుగోలు చేసిన భూమిని ఆర్ఓఆర్‌లో నమోదు చేసుకున్నామన్నారు.